రువాండాలో మార్‌బర్గ్ వైరస్‌తో 15 మంది మృతి

న్యూఢిల్లీ: రువాండా సహా 17 దేశాల్లో మార్‌బర్గ్ వైరస్ అలజడి రేపుతున్నది. ఈ వైరస్ సోకడంతో ఇప్పటికే రువాండాలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మందికి ఈ వైరస్ సోకినట్లు అంచనా. మార్‌బర్గ్ వైరస్ వల్ల వైరల్ హెమరేజిక్ ఫీవర్ వస్తుంది. కొన్నిసార్లు రక్త నాళాలను దెబ్బతీస్తుంది. ఫలితంగా రక్తం స్రవిస్తుంది. గబ్బిలాల నుంచి మానవులకు ఈ వైరస్ సోకుతుంది. ఈ వైరస్ సోకినవారి రక్తం, లాలాజలం, మూత్రం ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధితో బాధపడేవారికి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, అతిసార వస్తాయి. ఇది తీవ్ర స్థాయికి చేరినపుడు శరీరం లోపలి భాగాల్లోనే రక్తం స్రవిస్తుంది. అవయవాలు పని చేయడం మానేస్తాయి. చివరికి రోగి మరణానికి దారి తీయవచ్చు. రువాండా సహా ఇతర దేశాలకు వెళ్లాలనుకునేవారు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

నేడు నికేశ్ బినామీల లాకర్లు తెలుస్తం

- నవంబర్‌లో 17 ట్రాప్‌లు, 1 అక్రమాస్తుల కేసు
- ముగ్గురికి జైలు శిక్ష, జరిమానాల విధింపు: ఏసీబీ డీజీ

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఏసీబీ చరిత్రలోనే రెండో అతిపెద్ద కేసుగా పరిగణిస్తున్న హేరూర్ నికేశ్‌కుమార్ ఆస్తులపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నికేశ్‌కుమార్ బినామీల బ్యాంకు లాకర్లను ఇవాళ తెరుస్తారని సమాచారం. సోమవారమే లాకర్లను తెరవాలని భావించినప్పటికీ మంగళవారానికి వాయిదా వేసినట్టు ఏసీబీ వర్గాలు తెలిపాయి. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఏసీబీ.. నికేశ్‌తో సంబంధం ఉన్న వ్యక్తులను కూడా విచారించి, అరెస్టు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. ఏసీబీ నవంబర్‌లో 17 ట్రాప్‌లతో పాటు ఆదాయానికి మించిన ఓ కేసును నమోదు చేసింది. 17 ట్రాప్‌లలో 27 ప్రభుత్వ ఉద్యోగులు, ముగ్గురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితులను రిమాండ్ చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులెవరైనా లంచాల కోసం వేధిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని, ఎక్స్‌లో (twitter @TelanganaACB), ఫేస్‌బుక్‌లో ((@telanganaacb) ప్లాట్‌ఫామ్‌లలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

రేపే 'డీట్' ప్రారంభం

కంపెనీలకు, నిరుద్యోగులకు మధ్య వారధి

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన 'డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ' (డీట్)ను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. వివిధ కంపెనీలు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలు, అప్రెంటీస్‌షిప్, ఇంటర్న్‌షిప్‌ల వివరాలను ఈ వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులతోపాటు డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉన్న విద్యార్థులు ఈ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో నమోదైన అభ్యర్థులకు కంపెనీలు తమ అవసరాలకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. అభ్యర్థులకు కంపెనీలే నేరుగా మెసేజ్‌లు, ఈ-మెయిల్స్ పంపడంతోపాటు కాల్‌చేసి పిలుస్తాయి. 'డీట్' అనేది కంపెనీలకు, ఉద్యోగార్థులకు మధ్య వారధి లాంటిదని, ఇందులో తమ ప్రమేయం ఏమీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. 'డీట్'లో కనీసం 20 లక్షల మంది అభ్యర్థులను నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు 'డీట్' ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బెల్లంపల్లి, డిసెంబర్ 2 : అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరఢా ఝుళిపించారు. కన్నాల జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమి (112 సర్వే నంబర్)లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తహసీల్దార్ జ్యోత్స్న ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీ సాయంతో నేలమట్టం చేయించారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

8 నుంచి ప్రజారగ్ జోల్ యాత్ర

కాసిపేట, డిసెంబర్ 2 : గిరిజనుల సమస్యలు, హక్కుల పోరాట సాధన కోసం 8వ తేదీ నుంచి భద్రాది కొత్తగూడెం-ఆదిలాబాద్ ప్రజారగ్ జోల్ యాత్ర నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీరా తిరుపతి నాయక్ పిలుపునిచ్చారు. లంబాడీతండా(కే)లో సోమవారం సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగ్లోత్ మల్లేశ్ నాయక్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు ధరావత్ కైలాస్ నాయక్, జిల్లా విద్యార్థి సేన అధ్యక్షుడు గుగులోతు బాలాజీ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ధరావత్ రమేశ్, బదావత్ రమేశ్, జిల్లా కార్యవర్గ నిర్వాహక అధ్యక్షుడు అజ్మీరా రాజేశ్, జిల్లా యూత్ అధ్యక్షుడు భూక్య రమేశ్, భీమారం మండలాధ్యక్షుడు మోతీలాల్, లంబాడీతండా(కే) గ్రామ అధ్యక్షుడు రాజు, గ్రామ నాయక్ గనిరాం, యూత్ కార్యదర్శి నగేశ్, సోమగూడెం(కే) గ్రామ నాయక్ శ్రీనివాస్ నాయక్, గుగులోత్ భీమా, దేవ్‌సింగ్, తిరుమల్ పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

రెబ్బెన, డిసెంబర్ 2 : బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని తెలంగాణ భవన్‌లో 4వ తేదీన తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా (టీబీజీకేఎస్ అనుబంధం) నిర్వహించే మహాసభను జయప్రదం చేయాలని ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదేలు పిలుపునిచ్చారు. ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో సోమవారం మాట్లాడారు. 4వ తేదీన పెద్దపల్లికి వస్తున్న సీఎం సింగరేణి కాంట్రాక్టు కార్మికుల జీతాల పెంపు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గోలేటిలో జరిగే మహాసభలో కాంట్రాక్టు కార్మికుల జీతాల పెంపుదల కోసం చేపట్టవలసిన కార్యక్రమంతో పాటు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మాల్రాజు శ్రీనివాసరావు, పలువురు హాజరవుతారని చెప్పారు.

అనుకోడ పత్తి చేండ్లలో రైతులను అప్రమత్తం చేస్తున్న అటవీ అధికారులు

ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎఫ్ఆర్‌ఓ అనిల్

పులి సంచారంపై పుకార్లు

- అవగాహన కల్పిస్తున్న అధికారులు

చింతలమానేపల్లి, డిసెంబర్ 2 : మండలంలోని పలు గ్రామ శివారుల్లో పులి సంచరిస్తుందని పుకార్లు సోషల్ మీడియాలో రావడంతో అటవీశాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేశారు. మండల కేంద్రంతో పాటు, బాలాజీ అనుకోడ, బాబాసాగర్, డబ్బా, రవీంద్రనగర్-1, 2 గ్రామాల పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో రైతులు, పత్తి కూలీలకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో పుకార్లు వచ్చిన ఏరియాల్లో అటవీశాఖ అధికారులు, సిబ్బంది వెళ్లి చూడగా, ఆనవాళ్లు, పగ్ మర్క్స్ లభించలేదని ఎఫ్‌బీవో ప్రభాకర్ తెలిపారు. రైతులు పనులు చేసుకునే సమయంలో గుంపులు గుంపులుగా ఉండాలని, పులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే మండల వాసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరేశ్ తెలిపారు.

సోషల్ మీడియాలో చక్కర్లు

లోకల్ వాట్సాప్ గ్రూపుల్లో పులి వచ్చిందని మెస్సేజ్‌లు చక్కర్లు కొట్టడంతో రైతులు భయాందోళన చెందారు. పంట పొలాలు, పత్తి చేనుల్లో పనులు చేసుకుంటున్న సమయంలో పుకార్లు రావడంతో సోమవారం మధ్యాహ్నం చింతలమానేపల్లి, బాలాజీ అనుకోడ, డబ్బా గ్రామాల రైతులు, పత్తి కూలీలు ఇండ్లకు తిరిగి వెళ్లారు.

వాంకిడి, డిసెంబర్ : మండలంలోని చిన్న వాంకిడి శివారులోని పంట పొలాల్లో పెద్ద పులి వచ్చిందంటూ వాంకిడి కలాన్ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లిన ఓ రైతు తన చేనులో కనిపించినట్లు గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. దీంతో అటవీ శాఖ అధికారులు చిన్న వాంకిడి శివారుకు చేరుకొని పాద ముద్రల అనవాళ్లు పరిశీలించారు. పులి సంచారంలేదని, ప్రజలు భయాందోళన చెందవద్దని అటవీ శాఖ అధికారులు తెలిపారు. అలాగే రాత్రిపూట పశువులను వదిపెట్టవద్దని సూచించారరు. పెద్దపులి ఆచూకీ కోసం అటవీ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

దూడ చనిపోయింది చిరుతదాడిలో : ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్

పెంచికల్‌పేట్, డిసెంబర్ 2 : మండల కేంద్రంలోని దరోగపల్లిలో ఆదివారం పులి దాడిలో గేదె దూడ మృతి చెందిందని పశువుల కాపరి, రైతు వరిమడ్ల శ్రీనివాస్ తెలుపగా, ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్ బృందం సోమవారం ఘటన స్థలాన్ని పరిశీలించింది. దూడ మృతిచెందింది వాస్తవమేనని, కానీ చిరుతపులి దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించారు. తక్షణ సాయం కింద సదరు రైతుకు రూ.5వేలు అందజేశారు. అనంతరం ఎస్ఐ కొమురయ్యతో కలిసి గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కెరమెరి, డిసెంబర్ 2 : పులి సంచరిస్తున్నదనే బెడదతో అడవుల్లో నిప్పు పెట్టి వన్యప్రాణులకు హాని తలపెట్టవద్దని కెరమెరి ఎఫ్ఆర్వో సయ్యద్ మజారుద్దీన్ పేర్కొన్నారు. మండలంలోని ధనోర గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశువుల కాపారులు దట్టమైన అడవుల్లోకి వెళొద్దని, చేను పనులకు రైతులు ఉదయం 10 తర్వాతనే వెళ్లి, సాయంత్రం 4 గంటలకు తిరిగి రావాలని సూచించారు. అటవీ శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కౌటాల, డిసెంబర్ 2 : ప్రజలు పులి కదలికలపై అప్రమత్తంగా ఉండాలని కౌటాల ఎస్ఐ మధూకర్ సూచించారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలో గ్రామస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పులి అడుగులు గుర్తిస్తే వెంటనే అటవీ అధికారులకు గానీ, పోలీసులకు గానీ సమాచారం అందించాలని తెలిపారు.

రైతుల ఖాతాల్లోకి నగదు

హాజీపూర్, డిసెంబర్ 2 : జిల్లాలో 315 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేసి రూ.7.91కోట్లు సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంచిర్యాల అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ సోమవారం ఒక ప్రకటనల్లో తెలిపారు. జిల్లాలో ప్రతిపాదించిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 315 కేంద్రాల ద్వారా 8,050 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 502 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు వివరించారు. జిల్లాలో 13 రైస్ మిల్లుకు సీఎంఆర్ అనుమతులను జారీ చేసినట్లు తెలిపారు.

కొనసాగుతున్న అటవీశాఖ అవగాహన సదస్సులు

అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 2 : రానున్న వేసవికాలంలో అడవిలో నిప్పు వెలిగించకూడదని అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి. మండలంలోని చిర్రకుంట గ్రామంలో సోమవారం ఫారెస్ట్ బీట్ అధికారులు సాధిక్, వెంకటేశ్ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు రాధాకిషన్, కృష్ణయ్య, వెంకటేశ్, రవి, హనుమంత్ పాల్గొన్నారు.

లింగాపూర్, డిసెంబర్ 2 : లింగాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో అటవీ శాఖ ఆధ్వర్యంలో రైతుల, ప్రజలకు జోడెఘాట్ రేంజ్ ఆధికారి జ్ఞానేశ్వర్ అవగాహన కల్పించారు. వన్యప్రాణుల వేట చట్టరీత్యా నేరమని, అక్రమంగా కలప తరలించవద్దని, అడవుల్లో విద్యుత్ తీగలు అమర్చవద్దని సూచించారు. జైనూర్ సీఐ రమేశ్, లింగాపూర్ ఎస్ఐ గంగన్న, ఇన్‌చార్జి ఎంపీవో రజనీకాంత్, ఏఈ అఖిల్ అహ్మద్, పైర్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

జన్నారం, డిసెంబర్ 2 : జన్నారం, తాళ్లపేట్ రేంజ్ పరిధిలోని గిరిజన గ్రామాల్లో అటవీ అధికారులు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించినట్లు రేంజ్ ఆఫీసర్ సుష్మారావు తెలిపారు. అల్లినగర్, దొంగపెల్లి, సింగరాయిపేట, మల్యాలతో పాటు, అడవుల్లో నివాసం ఉండే అన్ని గ్రామాల్లోని ప్రజలు అగ్ని ప్రమాదాలు జరుగకుండా సహకరించాలని సూచించారు.

హ్యాండ్ పోటీల్లో ప్రతిభ

నస్పూర్, డిసెంబర్ 2 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నవంబర్ 25 నుంచి 30 వరకు జరిగిన ఎస్జీఎఫ్ జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ఢిల్లీ జట్టుపై తెలంగాణ జట్టు పోరాడి నాలుగో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం క్రీడాకారులు అమూల్య, ముత్తుబాయి, అనిత, మౌనికను జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేసన్ కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి అలుగువెల్లి రమేశ్ అభినందించారు. జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫణిరాజా, కరాటే సెక్రటరీ మహేశ్, కోచ్ అరవింద్,సాయి, శేఖర్, సీనియర్ క్రీడాకారులు వైష్ణవి, ప్రవీణ్, కార్తీక్ పాల్గొన్నారు. అలాగే నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన బాలికల జట్టును, కోచ్ అరవింద్, మేనేజర్ గోగర్ల సాయిని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్, కార్యదర్శి అభినందించారు. జిల్లా ఒలింపిక్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కరాటే కార్యదర్శి మహేశ్, మీనారెడ్డి, కళ్యాణ్ అభినందించారు.